విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 05, ఆగస్టు 2025

జననీ మహిళ బ్యాంకు సీఈఓ అరెస్టు

మహిళా బ్యాంకు పేరుతో మహిళలను నిండా ముంచి రూ.1.50 కోట్లు సహా

విశాలాంధ్ర– కోవెలకుంట్ల: పరారీలో ఉన్న జననీ మహిళా బ్యాంక్ సీఈఓ ఆకుల వెంకటరమణను ఎట్టకేలకు కోవెలకుంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ హనుమంత్ నాయక్, ఎస్సై మల్లికార్జున్ రెడ్డిలు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, కేసు వివరాలు వెల్లడించారు. కోవెలకుంట్ల, చాగలమర్రి, ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె పట్టణంలో జననీ పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్ పేరుతో కార్యాలయాలు ప్రారంభించి, మహిళా బ్యాంకులంటూ నమ్మించాడు. తక్కువ టైంలోనే మహిళలను కోటీశ్వరులు చేస్తామని నమ్మపలికి, మహిళల నుండి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించాడు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన గువ్వల పద్మావతమ్మ కార్యదర్శిగా ఆమె కుమారుడు రవీంద్రారెడ్డి సలహాదారుగా, తమ కోడలు సౌజన్య మేనేజర్‌గా, గౌరవ అధ్యక్షురాలుగా ఉత్తపు వానిదేవి, కోశాధికారిగా హరిప్రియ, అధ్యక్షురాలుగా సుజాతలు నియమించుకొని కుట్ర కోణాన్ని పథకం ప్రకారం అమలు చేసినట్టు పోలీసులు తెలిపారు. కోవెలకుంట్ల చుట్టుపక్కల ఉన్న ప్రజల నుండి సేవింగ్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు పేరుతో పెద్ద మొత్తంలో నగదులు సేకరించారు. అధిక వడ్డీలు ఇస్తామని చెప్పిన నమ్మించారు. ఇలా 800 మంది ఖాతాదారుల నుండి పెద్ద మొత్తంలో సొమ్ము సేకరించారు. ఈ మొత్తాన్నీ నిందితులు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకుని బోర్డు తిప్పేశారు. రూ. కోటి 50 లక్షలతో ఆకుల వెంకటరమణ పరారైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో మోసపోయిన బాధ్యత మహిళలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కడప పట్టణానికి చెందిన ఆకుల వెంకటరమణతో పాటు ఏడుగురిపై కోవెలకుంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ రెండో తేదీ కోవెలకుంట్ల పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటినుండి పోలీసులకు చిక్కకుండా వెంకటరమణ పరారీలో ఉన్నారు. రెండు నెలలుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న వెంకటరమణను పెట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపారు.

ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు అరెస్ట్: నంద్యాల, కోవెలకుంట్ల, బనగానపల్లె, చాగలమర్రి పట్టణాల్లో జనని పరస్పర సహకార సంఘం పేరుతో మహిళా బ్యాంకు ఏర్పాటుచేసి 3920 మంది ఖాతాదారులకు కుచ్చుటోపి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా సోమవారం ప్రధాన నిందితుడు ఆకుల వెంకటరమణ అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఇలాంటి నకిలీ సంస్థలన్నీ ప్రజలు నమ్మి డిపాజిట్ చేయవద్దని సీఐ హనుమంతు నాయక్ సూచించారు.

బాధ్యతాయుతంగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను బాధ్యతాయుతంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు హాలులో సోమవారం జేసీ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిమాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారునికి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అనంతరం డిఆర్ఓ రాము నాయక్‌తో కలిసి జేసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం రేషన్ కార్డులు ఇంటి పట్టాల మంజూరు పెన్షన్ మంజూరు తదితర సమస్యలపై దాదాపు 289 విన్నతులను సమర్పించారు. వీటన్నిటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జెసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - బనగానపల్లె: హాస్టల్ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తెలిపారు. పట్టణం రవ్వలకొండలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, బిసి హాస్టల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను బిసి రాజారెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయా పాఠశాలల వద్దకు చేరుకున్న బిసి రాజారెడ్డికి ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిసి రాజా రెడ్డి మాట్లా డుతూ హాస్టల్ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించా లని లక్ష్యంతో ఉపాధ్యాయ సిబ్బంది కోరిక మేరకు హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ తల్లిదండ్రులు కీ.శే.బిసి గుర్రెడ్డి, లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం ప్రభుత్వ హాస్టల్లో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా విద్యాల యం ఎస్ఓ సునీత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ, బిసి హాస్టల్ వార్డెన్ నాగేంద్ర విష్ణువర్ధన్ రెడ్డి, శేషారెడ్డి, మధుసూదన్ రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటసాగుకు సరిపడా ఎరువులను అందించి, అన్నదాతను ఆదుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో పంటసాగుకు సరిపడా ఎరువులను అందించి అన్నదాతలను ఆదుకోవాలని రాజకీయాలపై, ప్రత్యర్థి నేతలపైన దృష్టిపెట్టడం సరికాదని, రైతులపై దృష్టి సారించి, వారి కష్టాలను, సమస్యలను తీర్చాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఎరువుల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై, తద్వారా రైతన్నలు పడుతున్న ఇబ్బందులపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇసాక్ బాష, రాష్ట్ర మాజీ మార్కెఫెడ్ చైర్మన్ వీపీ నాగి రెడ్డి,గోస్పాడు మండలం సొసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఎం.కృష్ణాపురం సర్పంచ్ కోటిరెడ్డి, శీలం శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర మాజీ మార్కెఫెడ్ చైర్మన్ పి.పి.నాగి రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాతలపై నిర్లక్ష్యం వహిస్తున్నాడని, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సిద్ధమయిన రైతన్నలకు సంవృద్ధిగా సాగునీరు అందించలేక పోతున్నారని, ఎరువులను సరిపడా పంపిణీ చేయలేక రైతన్నలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవమున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కష్టాలు తీరుస్తాడని గంపెడాశతో ఉన్న రైతులను కష్టాల్లోకి నెట్టాడని గతంలో రైతులపై బుల్లెట్ల వర్షం కురిపించాడన్నారు. అన్నదాత సుఖీభవ అంటూ మాటల వరకే పరిమితమయ్యాడని, అధికా రంలోకి వచ్చి సంవత్సరం మూడు నెలలు కావస్తున్నా రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారన్నారు. సకాలంలో వర్షాలు కురిసినా, ఎరువుల లభ్యత ఉన్నా కూడా రైతులకు యూరియా పంపిణీ అరకొరగా అందిస్తు రైతన్నలను కన్నీరు పెట్టిస్తున్నారని అన్నారు. రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని, కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తున్నారన్నారు. రైతులకు భరోసా ఉండదు, ఉండబోదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంలో నిజం దాగి ఉందని, నేడు నిజంగానే రైతులకు అన్యాయం చేస్తున్నాడని విమర్శించారు.

పంటలకు ఊపిరి పోసిన వర్షం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షం పంటలకు ఊపిరి పోసింది. నాలుగు రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. మండలంలోని మదనంతపురం, చింతలాయ పల్లి, అబ్దుల్లాపురం, కోరుమానిపల్లి, చేన్నంపల్లి, పెట్నికోట, నాయన పల్లి, కొలిమిగుండ్ల, మీర్జాపురం తదితర గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు మొక్కజొన్న, కంది, పత్తి, తదితర పంటలను వర్షాధారంగా విస్తారంగా సాగు చేశారు. భారీ వర్షాలు లేనప్పటికీ కురిసిన మోస్తారు వర్షాలతో పంటలు సాగు చేశారు. పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్న దశలో వర్షం కురిసింది. దీంతో ఆయా పంటలకు ఊపిరి పోసినట్లయింది.

మినరల్ వాటర్ ప్లాంట్ అక్రమ కూల్చివేతపై జేసీకి పిర్యాదు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మినరల్ వాటర్ ప్లాంట్ అక్రమ కూల్చివేతపై జేసీ విష్ణుచరక్‌కు జిల్లా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్ర రెడ్డి, గంగుల బ్రిజేంద్ర రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ కేసీ కెనాల్, బోర్ల కింద ఎక్కువ శాతం వరి పంటను రైతులు పండిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద యూరియా లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద పార్టీ అనుచరులకే కూటమి ప్రభుత్వం యూరియాను అందిస్తుందన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ యూరియా కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలోని మంత్రులకు రైతుల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. గత నెల 31 వ తేదీన బనగానపల్లె పట్టణం పాత బస్టాండ్ వద్ద ఉన్న ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ అక్రమ కూల్చివేతకు సంబంధించిన బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - పాములపాడు : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు పాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నాగ రవీంద్ర సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తమ పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు పూజ, వైష్ణవి, సానియా, సబియా, చరణ్ రాజు అద్భు తంగా రాణించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారనీ వారి విజయానికి ముఖ్య కారణం వారి కృషి, పట్టుదలతో పాటు వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాన్ని మన పాఠశాల గౌరవంగా పేర్కొన్నారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా సన్నద్ధం చేసిన ఫిజికల్ డైరెక్టర్ సాయి కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారుల తదుపరి రాష్ట్రస్థాయి పోటీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్ ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ ఎన్నికలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం నంద్యాల మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ అలీ హుస్సేన్ నిర్వహణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఫయాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పడిన తర్వాత జిల్లాలో బాక్సింగ్ అభివృద్ధికి కృషి చేసిన ఫయాజ్ బాక్సింగ్ రాష్ట్ర సంఘం కార్యవర్గానికి ఎన్నిక కావడం అభినందించదగ్గ విషయమన్నారు. నంద్యాలలో బాక్సింగ్ అభివృద్ధికి శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి సహకరిస్తామన్నారు. క్రీడాకారులు మంచి కోచ్ శిక్షణలో క్రమశిక్షణతో, అంకితభావంతో నిరంతర సాధన ద్వారా విజయాలు సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ అలీ హుస్సేన్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగ రాజు, నంద్యాల బాక్సింగ్ ఇంచార్జ్ సర్దార్, బనగానపల్లె బాక్సింగ్ కోచ్‌లు చంద్ర మహబూబ్ బాషా, ఆత్మకూరు ఇంచార్జ్ ఉపేంద్ర, అసోసియేషన్ సభ్యులు మద్దిలేటి, ప్రసాద్, జస్వంత్, షా నవాజ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు అధికారులకు వెనక్కిచ్చిన అంగన్‌వాడీలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ ఏఐటియుసి, సిఐటియు నాయకులు ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడి కార్యకర్తలు నిరసన నిర్వహించి సీడీపీఓ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ తమకు ఇచ్చిన సెల్ఫోన్లను సిబ్బందికి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన సెల్ ఫోన్లు సరిగ్గా పని చేయడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని భారం పెంచారని, వివిధ రకాల యాప్లను ప్రవేశపెట్టడంతో ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు పర్సనల్ వర్క్‌లు చెబుతూ తాము ఇచ్చిన గడువులోగా పని చేయాలని లేదంటే మెమోలు జారీ చేస్తామని చెప్తున్నారన్నారు. ఇంత పని చేస్తున్న వారికి కనీస వేతనం లేదన్నారు. సుప్రీంకోర్టు గ్రాటివిటీ ఇచ్చినటువంటి 26 వేల రూపాయలు జీతం తమకు అమలు చేయాలని, అన్ని యాప్లు కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలని ఎఫ్ఆర్ఎస్ ఇన్ అవుట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ ఏఐటియుసి నాయకులు వసుంధర, సునీత, సుమలత, సిఐటియు నాయకులు తాళ్ల రమేష్ బాబు, అంగన్వాడి నాయకురాలు పెద్దక్క, శాంత, సుధామణి, భారతి, గాంధీ, బాల తిమ్మక్క, బద్రుణ్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డిని సన్మానించిన శిరివెళ్ల ఎంపీపీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని భూమా కిషోర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డిని శిరివెళ్ళ వైసీపీ నేత, భూమా కిషోర్ అభిమాని ఉల్లి గురప్ప ఆధ్వర్యంలో శిరివెళ్ళ ఎంపీపీ నాయక్ వసీమ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం భూమా కిశోర్ రెడ్డిని శాలువా కప్పి, పూల మాలలు వేసి ఉల్లి గురప్ప, ఎంపీపీ వసీమ్‌లు ఘనంగా సన్మానించారు. అనంతరం శిరివెళ్లలో నెలకొన్న సమస్యలపై, రాజకీయ సమీకరణాలపై భూమా కిశోర్ రెడ్డితో ఉల్లి గుర్రప్ప చర్చించారు. పెద్ద వీరభద్రుడు, ప్రతాప్, మౌలా, ఖాజాపీర్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

అహోబిలంలో నిర్మిస్తున్న అన్న సత్రానికి రూ.20 వేల విరాళం: అహోబిలం గ్రామంలో నిర్మిస్తున్న మాలోల అన్న సత్రానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి 20,000 రూపాయల విరాళమిచ్చారు. సోమవారం మాలోల అన్న సత్రం నిర్వాహకులు పట్టణంలోని భూమా కిషోర్ రెడ్డి స్వగృహంలో కలిసి అన్న సత్రానికి సహకారం అందివ్వాలని కోరడంతో రూ.20 వేలు అందించారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: స్థానిక బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 97 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలిచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

రెవెన్యూ, సర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే అర్జీలే వస్తాయని, వాటిని పగడ్బందీగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆత్మకూరు డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాల యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల అర్జీలను జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే అర్జీలను తప్పనిసరిగా నాణ్యతతో పరిష్కరి స్తారన్న నమ్మకం అర్జీదారులకు కల్పించేలా వాటి పరిష్కరణకు చర్యలు తీసుకో వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కేస్ బై కేస్ అర్జీలను నివృత్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఆత్మకూరు తహసీల్దార్ రత్న రాధిక, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొంది, లా పట్టా అందుకొని..

- న్యాయవాదిగా సభ్యత్వం పొందిన పీఎండీ ఉస్మాన్

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఉన్నత విద్యలు, అత్యున్నత డిగ్రీలు కలిగి ప్రధానోపాధ్యాయునిగా సమాజంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. పదవీ విరమణ పొందిన ఓ అలుపెరగని మాస్టర్ నేడు, లా పట్టాను సైతం అందుకొని న్యాయవాదిగా అరంగేట్రం చేసిన ఘనత శిరివెళ్ల మండల కేంద్రంలోని ముల్లాపేటలో చోటు తీసుకున్నది. వివరాల్లోకి వెళితే ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండల కేంద్రం ముల్లపేటలో నివసిస్తున్న పీఎండి ఉస్మాన్ సారు 2017లో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం ఎందరో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంలో పీఎండీ ఉస్మాన్ సమాజంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన లా డిగ్రీ పూర్తి చేసుకొని, న్యాయవాద వృత్తికి సైతం వచ్చ జెండా ఊపుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ సామాజిక చట్టం న్యాయం పట్ల అవగాహన కల్పించడమే తమ ధ్యేయమంటున్నారు. అమరావతి హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసి, భారత రాజ్యాంగం పట్ల విధేయతతో చట్టానికి లోబడి నడుచుకుంటూ న్యాయవాది వృత్తిని కొనసాగి స్తానని పీఎండీ ఉస్మాన్ అన్నారు. లా పూర్తి చేసుకోని న్యాయవాద పట్టా పొందిన అనంతరం నంద్యాల బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకొన్నారు. పీఎండి ఉస్మాన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వృత్తికి వన్నెతెస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి రాష్ట్ర నాయకునిగా ఎన్నుకోబడ్డారు. మరోవైపు సుదీర్ఘకాలంగా మర్కస్ మసీదు అధ్యక్షునిగా కొనసాగుతూ ఉన్నారు. ఇది ఇలా ఉంటే ఉస్మాన్ కూతురు ఏసీటీఓగా కుమారుడు కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా మరో కుమారుడు జిల్లా కోర్టులో న్యాయవాదిగా వారి వారి ఉద్యోగ విధులలో స్థిరపడి ఉన్నారు.

ఇమ్యూనైజేషన్‌పై శిక్షణ

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామాల్లో చిన్నారులకు వేసే నెలవారి టీకాలపై ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలకు సంచార చికిత్సల జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చాగలమర్రి పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలో జరుగుతున్న సంచార చికిత్స వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేసారు. రోగులకు సరైన చికిత్సలు, మందులు అందుతున్నాయా, లేదా అని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారి సంటెన్న, వైద్యులు ఇమ్రాన్, అంజలి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సిహెచ్ఓ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం ఎంతో శ్రేష్టమని అంగన్వాడీ సూపర్వైజర్ దస్తగిరమ్మ అన్నారు. పట్టణంలోని మూడో అంగన్వాడి కేంద్రంతోపాటు 15,17, 21వ అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులతో సమావేశం నిర్వహించి, వారికి అవగాహన కల్పించారు. తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలు పోత పాల వలన వచ్చే జబ్బులు నష్టాలు గురించి సూపర్వైజర్ దస్తగిరమ్మ అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వార్డులో కాన్పు అయిన తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలు వలన పిల్లలకు కలిగే ప్రయోజనాలు అవగాహన కల్పించారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పదవ కేంద్రం వర్కర్ పెద్దక్క, అంగన్వాడి వర్కర్లు మమత, గుల్జార్, విజయ, అరుణ, హుస్సేనమ్మ, గౌసియా బేగం, మరియమ్మతో పాటు పదవ అంగన్వాడీ కేంద్రం మహిళా పోలీసు శ్వేత, ఆయా లక్ష్మీదేవి, ఆశ వర్కర్లు జయమ్మ చంద్రమణి పాల్గొన్నారు.

భరోసా భద్రత ఉన్నచోట వ్యాపార అభివృద్ధి

విశాలాంధ్ర - బనగానపల్లె: వ్యాపార సంస్థల అభివృద్ధికి బనగానపల్లె పట్టణం కేంద్ర బిందువుగా మారిందని ఏపీ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయం ఎదురుగా సురేంద్రకు చెందిన నూతన బాలాజీ స్వీట్ షాప్ ను బీసీ ఇందిరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరా రెడ్డి మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భరోసా భద్రత వలన వ్యాపారవేత్తలు బనగానపల్లె పట్టణంలో వివిధ వ్యాపార సంస్థలను ప్రారంభించెందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. స్వీట్ యాజమాని సురేంద్ర వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రూరల్ అర్బన్ సిఐలు ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా వాణిజ్య విభాగా చైర్మెన్ టంగుటూరి సీనయ్య, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, చెరువు పల్లె శరత్ బాబు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, టీచర్ నాగరాజు, శరత్ కుమార్ రెడ్డి ,పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యాగంటి ఉమామహేశ్వరులకు పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగం టి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వర స్వామి ఆలయం లో సోమ వారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి పర్య వేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రజలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసుల శర్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన గ్రామపంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వం ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నమెంట్ ప్రజల చేతిలో ప్రభుత్వం ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను వాట్సాప్ లో సులభంగా పొందవచ్చన్నారు. 9552300009 అనే మన మిత్ర వాట్సాప్ ద్వార 200 సేవలను సులభంగా పొందవచ్చున్నారు. ప్రభుత్వం సూచించిన నెంబర్ మినహా మిగిలిన నంబర్లకు మెసేజ్‌లు చేసి, సమాధానాలు చెప్పి మోసపోవద్దని సూచించారు.

చిన్న కమ్మలూరు మెట్ట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: శిరివెళ్ల, రుద్రవరం రహదారిలో కొక్కిలేరు వాగు నుంచి చిన్న కమ్మలూరు మెట్ట వరకు రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, యువజన సమైక్య నాయకులు మధు, పాములేటి కలిసి సంతకాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ శిరివెళ్ల నుంచి రుద్రవరం వెళ్లే దారిలో ఒక్కిలేరు వాగు నుంచి చిన్న కమ్మలూరు మెట్ట వరకు గత ఏడేళ్లుగా రోడ్డు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్ అండ్ బీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు, రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి జాయింట్ కలెక్టర్‌కు అందజేశామన్నారు.

పీ4 పథకంతో పేద కుటుంబాల అభివృద్ధి

విశాలాంధ్ర - వెలుగోడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన రెడ్డి సోమవారం బోయ రేవుల సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం సిబ్బందికి పీ4 సర్వే, నీడ్ సర్వే గురించి తగు సూచనలు ఇచ్చారు. సర్వేలను స్పీడ్ అప్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాకు నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఆయిల్ పామ్ సాగుకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి కర్నూలు జిల్లాకు 550 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించబడినదని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఆయిల్‌పామ్ పంట సాగు చేసి లాభాలలోకి వెళ్ళాలనేది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రతికూల వాతావరణంలో రైతులను ఆదుకునే పంట ఆయిల్‌పామ్ పంట అన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్స హించాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ ఆయిల్ పామ్ పథకం కింద కర్నూలు జిల్లాలో కర్నూలు, క్రిష్ణగిరి, సి.బెళగల్, కౌతాళం, ఆదోని, హొళగుంద, మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి, నందవరం, ఎమ్మిగనూరు, హాలహర్వి మరియు గోనెగండ్ల లాంటి 13 మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేయబడిన 13 మండలాల్లోని నీటి వసతి కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులు అని కలెక్టర్ తెలిపారు. రైతులు పండించిన పంటను కంపెనీల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఆయిల్ పామ్ పంట అధిక ఆదాయాన్ని కలిగించే పంట అని, రైతులు ఈ పంటను పెద్ద ఎత్తున సాగు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపీఎంఐపీ పథక సంచాలకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు..

ఆదర్శనీయం.. మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర- పత్తికొండ: ఆదర్శనీయం మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి గౌస్ దేశాయ్‌లు అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి 46వ వర్ధంతి వేడుకలను సీపీఐ (ఎం) కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈశ్వర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి అని కొనియాడారు. వామపక్ష పార్టీల తరఫున స్వర్గీయ ఈశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి, ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేసి పంట పొలాలకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఆనంద్ బాబు, రంగారెడ్డి, వీరశేఖర్, వైసీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, తెదేపా నాయకులు సోమ్లా నాయక్, సిపిఎం నాయకులు దస్తగిరి, గోపాల్, సురేంద్ర, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం చేయొద్దని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని నగరపాలక అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేష సాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్ఓ జునైద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐటీ విభాగ అధ్యక్షుడిగా పల్లెపాటి వెంకటేష్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : వైసీపీ ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువైన పార్టీగా, సమాచార యుగానికి అనుగుణంగా తన కార్యకలాపాలను ఆధునీకరించుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో పార్టీ సమాచార, ఐటీ విభాగాన్ని పటిష్టం చేయడం కోసం మండలానికి చెందిన యువ నేత పల్లెపాటి వెంకటేష్‌ను మండల ఐటీ విభాగ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం పల్లెపాటి వెంకటేష్ విలేకరులతో డిజిటల్ రంగంలో పార్టీ అభివృద్ధికి తాను చేయగలిగిన ప్రతి కృషిని అంకితభావంతో చేస్తానని వెల్లడించాడు. ఐటీ విభాగం పార్టీకి మౌనమైన అడ్డుగోడ కాదు, మాట్లాడే మేధస్సు అని, ప్రతి ఆన్‌లైన్ వేదికపై వైసీపీ హస్తం నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ బాధ్యత అప్పగించిన వైసీపీ నియోజకవర్గ ఇంచార్జీ బుట్టా రేణుక, బుట్ట శివ నీలకంఠకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేష్ నియామకాన్ని మండల పార్టీ నేతలు, కార్యకర్తలు స్వాగతించారు.

ట్రాన్స్‌జెండర్లు స్వశక్తితో రాణించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ట్రాన్స్‌జెండర్లు స్వశక్తితో రాణించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో 2 ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను జిల్లా కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వం నుండి స్కాలర్‌షిప్‌లు, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ, ఇతర ప్రయోజనాలు, సంక్షేమ చర్యలకు ఉపయోగ పడుతుందన్నారు. ట్రాన్స్జెండర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం శాఖ అధికారిని రాయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

ఈ నెల 6న రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాయలసీమ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని నదీ జలాల సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆలోచన పరుల వేదిక ఆధ్వర్యంలో కర్నూలులో ఈనెల 6వ తేదీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్‌లు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆలోచనపరుల వేదిక కమిటీ వెలుగొండ, పోతిరెడ్డిపాడు, గోరుకల్లు, అలగనూరు, ముచ్చుమర్రి, హంద్రీనీవా, సుంకేసుల ప్రాజెక్టుల పరిశీలించుకుంటూ ఈ బృందం 6న సాయంత్రం మూడు గంటలకు కర్నూలు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని ఎస్టీయూ భవనంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ప్రాజెక్టుల విశ్లేషకులు, రిటైర్డు ఐపీఎస్ అధికారి టి.లక్ష్మినారాయణ వెంకటేశ్వర్ రావు, రైతు సంఘం నాయకులు అక్కినేని భవాని ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్యలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సదస్సులో రాయలసీమలో నీటి లభ్యత ప్రాజెక్టు ఆవశ్యకత గురించి చర్చిస్తారని, రాయలసీమలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని త్వరిత గతిన ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రాయలసీమ రావాల్సిన న్యాయమైన నీటి వాటా రాబట్టుకునేందుకు భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తార న్నారు. నిర్లక్ష్యానికి గురైతున్న రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై చర్చించడం జరుగుతుందని రైతులు పెద్దఎత్తున పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



విశాలాంధ్ర-గోనెగండ్ల: సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు వి.మద్దిలేటి నాయుడు, తాలుకా రైతు అధ్యక్షులు కటికే మాలిక్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కె.శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షులు పూజారి ముని స్వామిలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలంటూ సీపీఐ నాయకులు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఎస్.యూనుస్, బోయ లింగన్న, బేతాళ పెద్ద బాష, మాల నరసింహుడు, ఎఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, అన్న పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : మోసానికి బ్రాండ్ అంబాసిడర్, ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ అంటూ భీరాలు పలికి అధికారంలోకి వచ్చాక ఎగనామం పెట్టిన ఘనుడు చంద్రబాబు అని వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తారపురం, రంగాపురం, చిన్నకడబురు గ్రామాల్లో చేపట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ మ్యానిఫెస్టోను ప్రజలకు చూపించి, మాయ మాటలతో అదికారంలోకి రాగానే,ప్రజలను దారుణంగా మోసం చేసి ఎగనామం పెట్టిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు రఘురామ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, బూత్ కమిటీ నియోజక వర్గ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు రవి చంద్రారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

ఉరుకుందలో పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - కౌతాళం: శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా రెండవ సోమవారము శ్రీ ఉరుకుంద లక్ష్మీ నరసింహ (ఈరన్న) స్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సోమవారం స్వామివారికి కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర నుండి వేలాదిగా భక్తుల తరలివచ్చారు. తుంగభద్ర దిగువ కాలువలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని వండి పూజలు నిర్వహించారు. మరి కొంతమంది భక్తులు తల లీలాలు అర్పించారు ఆదివారం రాత్రి నుండి భక్తులు భారీ సంఖ్యలో ఉరుకుంద క్షేత్రానికి చేరుకోవడంతో అధికారులు తెల్లవారుజామున నుండే స్వామి వారి దర్శనానికి భక్తులను కొనసాగించారు. దేవాలయం టికెట్ల కౌంటర్ల వద్ద భారీ రద్దీ నెలకొంది, స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ రాజు దేవాలయ పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, సిబ్బంది భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. భక్తుల కోసం ఆదోని, ఎమ్మిగనూరు, డిపోల నుండే కాక కర్ణాటక బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్, నుండి సైతం ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

సెల్ ఫోన్‌ల దొంగల అరెస్ట్.. 56 సెల్ ఫోన్లు స్వాధీనం



విశాలాంధ్ర - కోడుమూరు : గత ఐదు రోజుల నుండి పట్టణంలో తిరుగుతూ కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మూడు సెల్‌ఫోన్‌లను దొంగలించి, మళ్ళీ దొంగలించుకోవడానికి సోమవారం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న నలుగురు యువకులను పట్టుకుని, అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు. సోమవారం ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోమవారం స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఎస్సై డి.ఎర్రిస్వామి సెల్ ఫోన్‌ల దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు 59 టచ్ స్క్రీన్ సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని చిగురుమన్ పేటకు చెందిన ఎరుకలి గంగరాజు కుమారుడు శశికుమార్ ఉరఫ్ నాని (23), ఈరన్న కుమారుడు కె.శ్రీను (36)తోపాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నారని వివరించారు. అరెస్టు చేసిన వారి వద్ద నుండి సుమారు 56 టచ్ స్క్రీన్ వివిధ కంపెనీలకు చెందిన సెల్ ఫోన్‌లను స్వాధీన పరుచుకున్నమన్నారు. వారి స్టేట్మెంట్ మేరకు వారు డోన్ టౌన్ చిగురుమాన్ పేటకు చెందిన వారని చెప్పారు. వారు నలుగురు కలిసి గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలోని రద్దీగా ఉన్న బస్టాండ్, దేవాలయాలు తదితర ప్రాంతాలకు వెళ్లి, పిక్ పాకెటింగ్ చేయుచూ సెల్ఫోన్లు దొంగతనం చేయుచు, వాటిని గుర్తు తెలియని వారికి విక్రయించి జీవనం చేస్తున్నారని, నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత 20 రోజుల నుండిపై తెలిపిన నలుగురు బెంగళూరు, చిక్కబల్లాపూర్, హొస్పేట, బళ్లారి, కొప్పల్ తదితర ప్రాంతాలలో సుమారు 56 సెల్ ఫోన్‌లను దొంగిలించిన స్వాధీనం చేసుకున్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు అందించాలి : మంత్రి



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సోమవారం నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇళ్ల స్థలాల విషయంపై చర్చించారు. అమీర్ హైదర్ ఖాన్ నగర్, కారల్మార్క్స్ నగర్, బుధవారపేట, జగన్నాథ గట్టుపై టిడ్కో ఇళ్లతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇళ్ల పట్టాలు లేనిచో వారికి పట్టాలు ఇచ్చే విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కర్నూల్లో ఇళ్ల పట్టాల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ క్వార్టర్స్ గురించి ఆరా తీశారు ఖాళీగా ఉన్న వాటిని ఇతరులు ఆక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు డీఆర్ఓ వెంకట నారాయ ణమ్మ, కర్నూల్ రూరల్ ఎమ్మార్వో రమేష్ బాబు, అర్బన్ తహసీల్దార్ రవి కుమార్, కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లు ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేశ్వరికి వినతి పత్రం అందజే శారు. ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షులు పూజారి ముని స్వామి మాట్లాడుతూ స్థానిక కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు గ్రౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ బాలికల హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినీలకు గదుల కొరత ఉందని, దీంతో విద్యార్థినీలు ఇబ్బంది పడుతున్నారు. ఈ కార్య క్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, అన్వర్, సురేష్, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, పట్టణ సహాయ కార్యదర్శి శివ, డివిజన్ నాయకులు హాజీ, మోహన్, రాజశేఖర్ పలువురితో కలిసి సోమవారం స్పందనలో సబ్ కలెక్టర్ మంత్రి మోర్య భరద్వాజ్ కు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతు నేరాలు-ఘోరాలు చేసి జైల్లో ఉన్న ఖైదీల కంటే దేశానికి రేపటి భవిష్యత్తు విద్యార్థుల మిస్ చార్జీలు తక్కువగా ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుర్తించారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో వార్డెన్‌లో సమయపాలన పాటించ కుండా, వంట మనుషులే నడుపుతున్న స్థితి నెలకొంద న్నారు. హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న కుక్, ట్యూటర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సీపీఐ 24వ మహాసభల గోడపత్రిక విడుదల



విశాలాంధ్ర - సి.బెళగల్: సీపీఐ జిల్లా మహాసభలు ఈ నెల 9, 10, 11 తేదీల్లో కర్నూలులో జరగనున్నాయని ఏఐటీయూసి మండల అధ్యక్షులు సి.మల్లికార్జున తెలిపారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల విధి విధానాలతో ప్రజా సంక్షేమం విచ్ఛిన్నకర పరిస్థితులుగా మారాయన్నారు. అనంతరం గోడ పత్రికలను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శేషన్న, సహాయ కార్యదర్శి పక్కిరన్న పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా విద్యార్థుల పదవీ నియామకం



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలోని శుక్రవారం జరిగిన విద్యార్థి ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఘనంగా విద్యార్థులు పదవీ నియామకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్, ఆర్ఐ రామాంజినేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, రామాంజినేయులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు విద్యార్థులు క్రమశిక్షణగా మెలగడానికి, నాయకత్వ లక్షణాలు పొంపొందించడానికి ఎంతో గానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, అకడమిక్ డీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

నొప్పి భరించలేక ఎల్లెల్సీలో దూకిన మహిళ

విశాలాంధ్ర- హొళగుంద: కర్ణాటక రాష్ట్రంలోని ఊలూరు గ్రామానికి చెందిన కురువ ఈశ్వరమ్మకు క్యాన్సర్ వ్యాధి సోకింది. ఈ వ్యాధి నయం కోసం కీమో థెరపితో పాటు అదనపు చికిత్సను పొందుతుంది. కాన్సర్ నొప్పి భరించలేక సోమవారం ఎల్లెల్సీ దిగువ కాలువలో దూకేసింది. కాలువలు దూకిన మహిళను యువకులు కాలువలో ఈదుతూ మహిళను గడ్డకు తీసుకువచ్చి ప్రాణం కాపాడారు. పోలీసు హెడ్ కానిస్టేబుల్ నాయక్, పోలీస్ కానిస్టేబుల్ అనిల్ కుమార్, జర్నలిస్టులు మహిళలు ఎంత ప్రదేయపడి అడిగిన ఊరు పేరు, భర్త పేరు, పిల్లల పేరు చెప్పలేక పోయింది. తీరా సంచిని తీసి వెతకగా కర్ణా టక రాష్ట్రం ఉలూరు నుండి హొళగుందకు వచ్చినట్లు ఆర్టిసి బస్సు టికెట్ దొరికింది. మహిళా ఫోటోలు వాట్సప్ ద్వారా వేసి, ఆరా తీయగా కుమారులు శేఖర్, నాగరాజు, మనవతి, ఉరుకుందమ్మాలు గుర్తించి పోలీసుల సహాయంతో ఊరికి తీసుకువెళ్లారు. క్యాన్సర్ వ్యాధి నొప్పి భరించలేక మహిళ బోరున ఏడ్చింది. మహిళా ఏడుపుపట్ల ప్రజలు మౌనంగా నిలుచుండిపోయారు.

విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి



విశాలాంధ్ర - కోడుమూరు: ప్రభుత్వ బీసీ, ఎస్సీ ఎస్టీ, కేజీబీవీ, గురుకుల, మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత పది రోజులుగా కోడుమూరు పట్టణ, మం డల పరిధిలోని అన్ని హాస్టళ్లను సందర్శించి, హాస్టల్స్ విద్యార్థులతో కలిసి వారి సమ స్యలు అడిగి తీసుకొన్నామని ఆయన తెలిపారు. సోమవారం ప్రభుత్వ బిసి, ఎస్సి సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆయన మండల తహసీల్దార్ నాగరాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. రంగస్వామి మాట్లాడుతూ పట్టణంలో కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ బీసీ బాలుర ప్రీ మెట్రిక్ హాస్టల్ మూతబడి విద్యార్థులు వారి చదువుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శి డి.వీరేంద్ర, ఎస్.అల్తాఫ్ బాష, మండల నాయకులు మాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న అధికారులు

విశాలాంధ్ర - నందవరం: రైతుల పట్ల ఎంతో శ్రద్ధ వహించి కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నో విధాలుగా ఆదుకోవాలని ప్రయత్నం చేస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం వలన చెడ్డపేరు వస్తుందని బిజెపి నాయకులు గురురాజ్ దేశాయ్ అన్నారు. సోమవారం వ్యవసాయ, సొసైటీ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు దాదాపుగా 213 మెట్రిక్ టన్నుల వచ్చాయని, యూరియా పంపిణీ రికార్డులు చూపించాలని కోరగా, తమ దగ్గర రికార్డులు లేవని, 2022కి సంబంధించిన రికార్డులు చూపిస్తుంటే అందరు ఆశ్చర్యానికి గురైయమన్నారు. యూరియా పంపిణీలో అవినీతికి పాల్పడిన ఏ అధికారిని వదిలిపెట్టే పరిస్థితి వుండదని, రైతులకు న్యాయం చేసేంతవరకు పోరాడుతామన్నారు. మాజీ సర్పంచు రామన్న గౌడు, వాల్మికి నాయకులు తోట పాండు, ఎస్సీ కాలనీ నాయకులు కె.శివ, డానియల్, ముస్లిం మైనారిటీ నాయకులు సుభాన్, అబ్దుల్, మినల్లా, గని, చాకలి హనుమన్న, తలమారి నాగరాజు, చాకలి శంకర్ పాల్గొన్నారు.

పెండింగ్‌లోని నిషేధిత భూ సమస్యను పరిష్కారం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న నిషేధిత భూమి సమస్యను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిష్కరించారు. ఆదోని మండలం చిన్న గోనేహాల్‌కు చెందిన ఎల్.విశ్వనాథరెడ్డికి సంతేకోడ్లూరు గ్రామ పరిధిలోని 435-ఏ సర్వే నంబర్‌లో 1.66 ఎకరాల భూమి ఉంది. ఇతడు తన అవసరాల కోసం 2015లో తన భూమిని వేరే వారికి విక్రయించారు. భూమిని కొన్నవారు 2018లో లోన్ కోసం బ్యాంక్‌కు వెళ్లగా, ఈ భూమి నిషేధిత జాబితాలో ఉందని తెలపడంతో భూమి కొన్న వారు విశ్వనాథ్ రెడ్డితో గొడవకు దిగడంతో, భూమి కొన్న వారికి విశ్వనాథ రెడ్డి డబ్బులు తిరిగి చెల్లించాడు.435-ఏ సర్వే నంబర్‌లో విశ్వనాథరెడ్డి భూమి 1.66 ఎకరాలతో పాటు 0.81 ఎకరాల వాగు పోరంబోకు భూమి కలిసి ఉండడంతో రెండూ కలిపి, మొత్తం 2.47 ఎకరాలను 2016లో 22ఏ కింద నోటిఫై చేశారు.. 2018 నుండి విశ్వనాథ రెడ్డి తన భూమిని నిషేధిత భూముల జాబితా నుండి తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. చివరకు పిజిఆర్ఎస్‌లో ఈ సమస్య జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా దృష్టికి రాగా, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి, విశ్వనాథ రెడ్డి భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి, డీ నోటిఫై చేశారు. సోమవారం విశ్వనాథ రెడ్డి జిల్లా కలెక్టర్‌ని కలిసి కృతజ్ఞతలు చెప్పి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తన సమస్యను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారుపరిష్కారం చేశారని, వారిని తన ఇంటికి భోజనానికి రావాలని ఆహ్వానించడం విశేషం.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని మూగమానగుంది క్రాస్ వద్ద గత రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షానికి ఆర్ అండ్ బీ పైప్ కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వరద నీటి ఉధృతికి పైపులు వంకలు కొట్టుకుపోయి నిలబడ్డాయి. కల్వర్టు సైడ్ వాల్ గండిపడి ప్రమాదానికి ఆహ్వానిస్తూ నిలబడిందని ప్రజలు ఆవేదన చెందారు. కల్వర్టు గండిలో వాహనాలు పడిపోతే ప్రమాదం తప్పదని ప్రజలు భయాందోళన చెందారు. దెబ్బతిన్న కల్వర్టును తొలగించి, కొత్త కన్వర్ట్ నిర్మించాలంటూ ఆర్ అండ్ బీ అధికారులకు ఎన్నోసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వెంటనే కల్వర్టు నిర్మించి, ప్రయాణభద్రతలు కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నించారు.

తల్లిపాలు అమృతంతో సమానం..

విశాలాంధ్ర - వెల్దుర్తి: తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానమనిఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఆమె పాల్గొనితల్లులకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను తెలిపారు. సంపూర్ణ పోషణ అభియాన్ కింద తల్లులు, గర్భిణులు బలవర్ధక ఆహారం ఐసీడీఎస్ ద్వారాఅందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పద్మావతి, మహేశ్వరి, నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నో అడ్మిషన్ బోర్డు.. నారా లోకేష్ ట్వీట్

విశాలాంధ్ర - ఆదోని : ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు లేవంటూ బోర్డు పెట్టడంతో స్పందించిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ట్వీట్ వేదికగా నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ మాట్లాడుతూ ఆదోని మున్సి పల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో ఇప్పటికే 1725 మంది విద్యార్థులు ఉండగా, నూతనంగా 2025-26 విద్యా సంవత్సరానికి 400 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడం జరిగిందని తెలి పారు. హైస్కూల్లో 1725 మంది విద్యార్థిని, విద్యా ర్థులు ఉండడంతో అడ్మిషన్లు ఇవ్వలే మంటూ అడ్మి షన్లు ఫుల్ బోర్డు పెట్టడం జరిగింది. హైస్కూల్లో స్థాయికి మించి అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థు లకు నాణ్యమైన సన్నబియ్యంతో డొక్కా మాణి క్యమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నడుపు తోందని, అన్ని సౌకర్యాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సాధించడంతోనే అడ్మిషన్లు ఫుల్ అయ్యాయని తెలిపారు. హైస్కూల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, హైస్కూల్లో 5 పీఈటి పోస్టులు, 4 హిందీ ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించాలని, హైస్కూల్లో పెండింగ్‌లో ఉన్న తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ స్కూల్లో నో అడ్మిషన్ బోర్డు సోషల్ మీడియాలో వార్తలు రావడంతో స్పందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 05, ఆగస్టు 2025

ఎరువులను అందించి, అన్నదాతలను ఆదుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రైతన్నల కంటకన్నీరు చూడ వద్దని, ఎరు వులను అందించి అన్నదా తలను ఆదుకో వాలని కోరుతూ జిల్లా జాయి ట్ కలెక్టర్ విష్ణు చరణ్ కు వైసీపీ మాజీ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ ఛైర్మన్ లు వినతి పత్రం అందజేశారు. రైతన్నలకు పంటల సాగుకు సరిపడా ఎరువులను అందించాలని, అన్నదాతల కంటకన్నీరు చూడరాదని, రైతులకు పార్టీలకతీతంగా చూడాలని, ప్రతి ఒక్క రైతుకు యూరియా అందజేయాలని కోరుతూ సోమవారం నంద్యాల జిల్లాలోని నియోజక వర్గాలకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, మాజీ మార్కెఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, గోస్పాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు రామ సుబ్బా రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు జాయింట్ కలెక్టర్ కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమెల్సీ మాటాడుతూ రైతులకు ఎరువులను పంట సాగుకు సరిపడేంత అందించాలని, గ్రామాల్లో రైతులను విభజించి పార్టీలను ఆపాదించి కేవలం టీడీపీకి చెందిన రైతులుగా భావించిన వారికి మాత్రమే ఎరువులను అందజేస్తూ మిగతా రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆర్ బీకేల ద్వార సకాలంలో సంవృద్ధిగా ఎరువులను అందించామని, నేడు సరిపడేంత ఎరువుల నిల్వలున్నాయని చెబుతున్న అధికారులు రైతులకు ఎందుకు అందించడం లేదో చెప్పాలన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రతి రైతును ఆదుకోవాలని కోరారు. రైతులను రైతుల మాదిరే చూడాలని వారికి పార్టీలను ఆపాదించవద్దని తెలిపారు.

ఐవీఎల్‌పీ భారత ప్రతినిధిగా డాక్టర్ వినూష రెడ్డి ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రతిష్టాత్మకమైన అమెరికా ఐవీఎస్‌పీ సమావేశానికి ఏపీకి చెందిన బీజేపీ నాయకురాలు బి.వినూషారెడ్డిని ఎంపిక కావడం అరుదైన అవకాశం అభినందనీయమని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం మౌర్యన్‌లో ఆయన ఎమ్మెల్యే పార్థసారధి, వినూషారెడ్డిలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో, సమాజంలో మహిళల పాత్రపై అమెరికాలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్ షిప్ ప్రోగ్రాముకు ఐవీఎస్‌పీకి ఆంధ్ర ప్రదేశ్ అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూష రెడ్డిని భారత ప్రతినిధిగా ఎంపిక చేసారని బీజేపీ ప్రకటించిందన్నారు. అమెరికా డిపార్టుమెంటు అఫ్ స్టేట్ నిర్వహిస్తున్న ఐవీఎస్‌పీ కార్యక్రమం భావి ప్రపంచ నాయకుల మధ్య పరస్పర అవగాహనకు భావజాల మార్పిడికి ప్రధాన వేదికగా నిలుస్తున్నది. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న భహుళ ప్రాంతీయ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 20 మంది విశిష్ట మహిళా నాయకురాల్లలో ఏకైక భారత ప్రతినిధి డాక్టర్ బి.వినూష రెడ్డి. ఈ కార్యక్రమంలో జపాన్, జర్మనీ, పోలాండ్, అర్జెంటినా, ఉక్రెయన్, బల్గేరియ, సింగపూర్, లెబనాన్, ఇరాక్, సౌత్ కొరియా, సౌత్ ఆఫ్రికా మరియు తైవాన్ దేశాల ప్రతినిధులు పాల్గొంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోది నాయకత్వంలో మహిళల అభివృద్ధికి అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్న తరుణంలో ఈమె ఎంపిక జరిగినది. చట్ట సభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ వంటి గొప్ప కార్యక్రమాల ద్వారా రాజకీయాలలో మరియు ప్రభుత్వంలో మహిళల భాగ్యస్వామ్యం పెరగడానికి మోదీ ప్రభుత్వం సంస్కరణలు తెచ్చింది. డాక్టర్ బి.వినూష రెడ్డి మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ కార్యక్రమానికి ఎంపిక కావడం వినమ్రతాపూర్వకంగా గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. గొప్ప ధార్శనికుడైన నరేంద్ర మోది నాయకత్వంలో, ప్రభుత్వంలో అన్ని రంగాల్లో మహిళల భాగ్యస్వామ్యం పెరగడానికి ఇస్తున్న ప్రోత్సహాన్ని ఇది ప్రతిబింబిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అద్యక్షులు రామకృష్ణ, నాయకులు మాధవీలత, రాఘవేంద్ర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం చేయొద్దని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని నగరపాలక అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేష సాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్ఓ జునైద్, పారి శుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐటీ విభాగ అధ్యక్షుడిగా పల్లెపాటి వెంకటేష్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : వైసీపీ ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువైన పార్టీగా, సమాచార యుగానికి అనుగుణంగా తన కార్య కలాపాలను ఆధునీకరించుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో పార్టీ సమాచార, ఐటీ విభాగాన్ని పటిష్టం చేయడం కోసం మండలానికి చెందిన యువ నేత పల్లెపాటి వెంకటేష్‌ను మండల ఐటీ విభాగ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం పల్లెపాటి వెంకటేష్ విలేకరులతో డిజిటల్ రంగంలో పార్టీ అభివృద్ధికి తాను చేయగలిగిన ప్రతి కృషిని అంకితభావంతో చేస్తానని వెల్లడించాడు. ఐటీ విభాగం పార్టీకి మౌనమైన అడ్డుగోడ కాదు, మాట్లాడే మేధస్సు అని, ప్రతి ఆన్‌లైన్ వేదికపై వైసీపీ హస్తం నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ బాధ్యత అప్పగించిన వైసీపీ నియోజకవర్గ ఇంచార్జీ బుట్టా రేణుక, బుట్ట శివ నీలకంఠకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేష్ నియామకాన్ని మండల పార్టీ నేతలు, కార్యకర్తలు స్వాగతించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గోనెగండ్ల: సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు వి.మద్దిలేటి నాయుడు, తాలుకా రైతు అధ్యక్షులు కటికే మాలిక్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కె.శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షులు పూజారి ముని స్వామిలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలంటూ సీపీఐ నాయకులు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఎస్.యూనుస్, బోయ లింగన్న, బేతాళ పెద్ద బాష, మాల నరసింహుడు, ఎఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, అన్ను పాల్గొన్నారు.

మహిళల సర్వతోముఖాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మహిళల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటూ ఉందని కుట్టు మిషన్ల శిక్షణ పూర్తి చేసుకుంటున్న మహిళలతో పరిశ్రమలు వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సోమవారం కర్నూలు కెవిఆర్ కళాశాల ప్రాంగణంలో మహిళలకు ఏప్రిల్ 15న ప్రారంభించబడిన కుట్టు మిషన్ల శిక్షణ మరికొద్ది రోజులలో వంద రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా మహిళలు మంత్రిని ఆహ్వానించారు. వారు ఏర్పాటుచేసిన సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మహిళా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళలు దృఢ సంకల్పంతో కష్టపడితే మీ భర్త, మీ పిల్లలకంటే ఎక్కువ సంపాదించే అవకాశం ఉందని, మహిళలు ఈశిక్షణ ను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బేసిక్ టైలరింగ్ శిక్షణ పథకంకు బిసి, ఈబీసీ మహిళలను ఎంచుకోవడం జరిగిందన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సతీష్ రెడ్డి, కోఆర్డినేటర్ ప్రభావతి ఇన్స్ట్రక్టర్ రజని ఈ కార్యక్రమం గురించి ప్రసంగించారు. అనంతరం మహిళలు మంత్రికి సన్మానం చేసి మంత్రిచే కేక్ కట్ చేయించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సతీష్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి, కార్పొరేటర్ పరమేష్, ప్రభావతి, రజని మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయష్కరం

విశాలాంధ్ర - చాగలమర్రి : శిశువులకు తల్లి పాలు శ్రేయష్కరమని వైద్యులు అంజలి తెలిపారు. సోమవారం పట్టణంలో వైద్య,ఆరోగ్య సిబ్బంది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అంజలి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని, ఇవి రోగ నిరోధక శక్తిని పెంచి, బిడ్డను ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ రమణమ్మ, హెచ్ఈ విజయభారతి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి,హెల్త్ అసిస్టెంట్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : ఇంటి కొలతలు, ఇతర వివరాలు సర్వే సిబ్బందికి తెలిపి, సకాలంలో స్వమిత్వ సర్వే పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని డిప్యూట డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ అన్నారు. మండలం లోని గొడిగనూరు గ్రామంలో సర్పంచ్ సంజీవరాయుడి అధ్యక్షతన గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల యజమానులను గుర్తించి వారికి హక్కు పత్రాలు ఇచ్చేందుకు స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు.ప్రజలు సహకరించి హద్దులు కచ్చితంగా గుర్తించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం ఇళ్ల స్థలాల యజమానులకు దృవపత్రాలు అందిస్తామన్నారు. అలాగే మండలం లోని శెట్టివీడు, గొట్లూరు గ్రామాలలో కూడా స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్సులు ఆదినారాయణ, రాజశేఖర్, తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దస్తగిరి, విఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు శిల్పా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణంలోని శ్రీ వాసవి మాత అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సోమవారం హాజరయ్యారు. శిల్పా చక్రపాణి రెడ్డిని ఆలయ కమిటీ అధ్యక్షులు లాలం సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆర్య వైశ్యులు శిల్పాను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో శిల్పా భువనేశ్వర రెడ్డి వైసీపీ నాయకులు, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా చింతలముని నల్లారెడ్డి దశమి ఉత్సవాలు

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోనే తంగరడోన గ్రామంలో కొలిచేవారికి కొంగు బంగా రంగా విరాజిల్లుతున్న శ్రీ చింతల ముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా చింతల ముని నల్లారెడ్డి స్వాముల వారికి తెల్లవారు జామున కుంకుమార్చన, పంచామృతాభి ేషకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలను ఆలయ పురోహితుల నిర్వహించారు. అనంతరం శ్రీ చింతల మునిస్వామి ఆలయం నుండి స్వామివారి అశ్వ వాహానాన్ని పల్లకిని గ్రామ పూర్వవీదల గుండా ఊరేగిస్తూ నల్లారెడ్డి స్వామి వారి ఆలయానికి చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుగు ఊరేగింపులో స్వామివారి అశ్వానికి భక్తులు పండ్లు, మిఠాయిలు తినిపించారు. అశ్వం పండ్లు, మిఠాయిలు తింటే వారి కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. దశమి ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైయస్సార్సీపి జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్ లు దశమి ఉత్సవాల్లో పాల్గొని స్వాముల వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి సాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మస్తాన్ వలి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పి.పార్వతి, సర్పంచు శంకరమ్మ, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ నరసప్ప, గ్రామ పెద్దలు సీతారామరెడ్డి, మల్లేశప్ప, సీనియర్ పాత్రికేయులు వెంకన్న, మాజీ డైరెక్టర్ మాబు, రాజన్న, కృష్ణమూర్తి, దస్తగిరి, మునిస్వామి, వెంకటేష్, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

మా పొలం ఇప్పించాలంటూ మహిళా రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు

- ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్న తలారిపై చర్యలు తీసుకోండి
- కలెక్టర్‌ను వేడుకున్న మహిళ రైతు సుభద్రమ్మ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : రెవిన్యూ శాఖలో పని చేస్తున్న ఓ చిరు ఉద్యోగి తన పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి, సాగు చేస్తున్నాడని, ఇదేమని అడిగితే భయభ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతు న్నారని, తన పొలాన్ని తనకిప్పించి, దౌర్జన్యానికి పాల్ప డుతున్న గ్రామ తలారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా రైతు సుభద్రమ్మ కలెక్టర్ రాజకుమారి గనియాకు మొర పెట్టుకున్నారు. సోమవారం ఆత్మకూర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న కలెక్టర్‌కు మిడుతూరు మండలం, చెరుకుచెర్ల గ్రామానికి, చెందిన సుభద్రమ్మ అనే మహిళ రైతు ఫిర్యాదు చేశారు. చెరకుచెర్ల గ్రామంలో సర్వే నంబర్ 34లో, 90 సెంట్లు భూమి తన భర్త వెంకటేశ్వర్లు పేరుపై ఉందన్నారు. తన భర్త మృతి చెందడంతో రెవిన్యూ శాఖలో పని చేస్తున్న తన భర్త తమ్ముడైన అల్ల గాంధీ, అక్రమంగా అధికార దుర్వినియోగంతో అక్రమంగా తన పేరు మీదికి ఆన్లైన్ చేసుకొని దౌర్జన్యంగా ఆక్రమించారని తెలిపారు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆన్లైన్లో తిరిగి నా పేరు మీదికి ఎక్కించడం జరిగిందని తెలిపారు. అయితే ఆన్‌లైన్ అయినప్పటికీ తిరిగి, తన పొలాన్ని దున్ని సాగు చేస్తూ పొలం వద్దకు రానివ్వడం లేదని, దీంతో పోలీస్ స్టేషన్‌కు సంప్రదించినట్లు తెలిపారు. పోలీసు అధికారులు తహశీల్దార్‌కు దీనికి సంబంధించిన రిపోర్టును ఇవ్వాల్సిందిగా కోరినా ఇంతవరకు ఇవ్వలేదని, తనకు న్యాయం చేయాలని తన గోడును విన్నవించుకుంది. దీంతో స్పందించిన కలెక్టర్ సంబంధిత తహశీల్దార్ అర్జీని పంపించి తక్షణ చర్యలు తీసుకునేలా చూస్తానని అన్నారు.

చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్‌లు కల్పించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ బనగాన పల్లె నియోజకవర్గ కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు చల్లా బాలస్వామి యాదవ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని చెరువు పల్లె గ్రామంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులుగా నాగయ్య యాదవ్, అధ్యక్షులుగా మద్దిలేటి యాదవ్, ఉపాధ్యక్షులుగా పశువుల రవి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సానం రమేష్ యాదవ్, కార్యదర్శిగా కోన రవి యాదవ్, ట్రెజరర్‌గా సానం నాగేంద్ర యాదవ్, కమిటీ సభ్యులుగా సానం వెంకటసుబ్బయ్య యాదవ్, పర్లపాటి శివ గంగరాజు యాదవ్, పొట్టెమ్మ గారి సీతారామయ్య యాదవ్, సానం బాల శేఖర్ యాదవ్, జి.చంద్రబాబు యాదవ్, పొట్టెమ్మ గారి రామ్మోహన్ యాదవ్, దత్తయ్య గారి బాల ఉసేనయ్య యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ యాదవులు విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, రాష్ట్రంలో 18 శాతం యాదవులు ఉన్న రాజకీయ పార్టీలు ఓట్ బ్యాంకుగా గుర్తిస్తున్నాయే తప్ప, తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి రాళ్ల కొత్తూరు శంకర్ యాదవ్, ఉపా ధ్యక్షులు నందవరం బాల వెంకటేశ్వర్లు యాదవ్, ఎల్ఐసీ శ్రీరాముల యాదవ్, నాయకులు చౌడం శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఫలాలు తింటే ఆరోగ్యం పదిలం

విశాలాంధ్ర - రుద్రవరం: నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ పకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆకు కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ ఎంసిఆర్‌పి శివశంకర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆకు కూరగాయల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిని వివిధ శాఖలకు చెందిన అధికారులు కొనుగోలు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ మండలంలోని నరసాపురం, మందలూరు గ్రామాలలో ఒక యూనిట్ ఏర్పాటు చేసి అన్ని రకాల ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించడం జరుగుతుందన్నారు. పకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలైన కూరగాయలు, ఆకు కూరలను తినడం వల్ల మనుషుల ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయన్నారు. పకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు పాటించడం వల్ల వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. భూమి సారవంతమవుతుందన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఏటీఎం మోడల్ వల్ల రైతులకు నిరంతర ఆదాయము వస్తుందన్నారు. అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిఆర్‌పి-2 గౌరీ, ఐసిఆర్‌పి సుబ్బరాయుడు, నరసింహుడు, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాల్మీకి, భక్త కనకదాసుల జీవితాలు అందరికి ఆదర్శప్రాయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : శ్రీ వాల్మీకి మహర్షి, భక్త కనకదాసు జీవితాలు అందరికీ ఆదర్శప్రాయమని మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ వాల్మీకి లక్ష్మన్న, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు ఈరన్న, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, వైసీపీ బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప స్పష్టం చేశారు. సోమవారం పెద్దకడబూరు మండల పరిధిలోని ముచ్చిగిరి గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ మాస శుక్ల దశమి ఉదయం 11.45 నిమిషాలకు సరియగు తుల లగ్న శుభముహూర్తం నందు శిఖర మరియు శ్రీ వాల్మీకి మహర్షి, శ్రీ భక్త కనకదాసు విగ్రహాల ఆవిష్కరణ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వివిధ పార్టీల నాయకులు శ్రీ వాల్మీకి మరియు భక్త కనకదాసు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహర్షుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ వాల్మీకి మహర్షి, శ్రీ భక్త కనకదాసు విగ్రహాల ఆవిష్కరణకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య శ్రీ వాల్మీకి మహర్షి, శ్రీ భక్త కనకదాసు చిత్రపటాలతో భారీగా ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతు, కల్లుకుంట గ్రామ సర్పంచ్ ఇస్మాయిల్, చిన్నతుంబళం సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప, టీడీపీ నాయకులు తలారి అంజి, చంద్ర, వైసీపీ నాయకులు బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

వివాహ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని ఎల్‌వీ ఫంక్షన్ హాల్ నందు వైసీపీ మండల అధ్యక్షులు రాజ మోహన్ రెడ్డి కుమారుడు అయ్యప్ప రెడ్డి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్ రెడ్డి, విజయ్ చౌదరి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బదిలీలు పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

విశాలాంధ్ర - హొళగుంద: స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో ఎస్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని, బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, జిల్లా అదనపు కార్యదర్శి సుంకన్న, హొళగుంద మండల శాఖ అధ్యక్షులు వై.వెంకటేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల శాఖ గౌరవ అధ్యక్షులు ఎస్ పోతరాజు, మండల గౌరవ ఉపాధ్యక్షులు జి.దొడ్డ బసప్ప, జిల్లా సహా కార్యదర్శి బి.టి.ఖలందర్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు అందించాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సోమవారం నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇళ్ల స్థలాల విషయంపై చర్చించారు. అమీర్ హైదర్ ఖాన్ నగర్, కారల్మార్క్స్ నగర్, బుధవారపేట, జగన్నాథ గట్టుపై టిడ్కో ఇళ్లతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇళ్ల పట్టాలు లేనివో వారికి పట్టాలు ఇచ్చే విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కర్నూల్లో ఇళ్ల పట్టాల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ క్వార్టర్స్ గురించి ఆరా తీశారు ఖాళీగా ఉన్న వాటిని ఇతరులు ఆక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు డీఆర్‌ఓ వెంకట నారాయ ణమ్మ, కర్నూల్ రూరల్ ఎమ్మార్వో రమేష్ బాబు, అర్బన్ తహసీల్దార్ రవి కుమార్, కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా విద్యార్థుల పదవీ నియామకం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలోని శుక్రవారం జరిగిన విద్యార్థి ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఘనంగా విద్యార్థులు పదవీ నియామకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్, ఆర్ఐ రామాంజినేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, రామాంజినేయులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు విద్యార్థులు క్రమశిక్షణగా మెలగడానికి, నాయకత్వ లక్షణాలు పొంపొందించడానికి ఎంతో గానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, అకడమిక్ డీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని మూగ మానగుంది క్రాస్ వద్ద గత రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షానికి ఆర్ అండ్ బీ ఫైవ్ కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వరద నీటి ఉధృతికి పైపులు వంకలు కొట్టుకుపోయి నిలబడ్డాయి. కల్వర్టు సైడ్ వాల్ గండిపడి ప్రమాదానికి ఆహ్వానిస్తూ నిలబడిందని ప్రజలు ఆవేదన చెందారు. కల్వర్టు గండిలో వాహనాలు పడిపోతే ప్రమాదం తప్పదని ప్రజలు భయాందోళన చెందారు. దెబ్బతిన్న కల్వర్టును తొలగించి, కొత్త కన్వర్ట్ నిర్మించాలంటూ ఆర్ అండ్ బీ అధికారులకు ఎన్నోసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వెంటనే కల్వర్టు నిర్మించి, ప్రయాణభద్రతలు కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నించారు.

తల్లిపాలు అమృతంతో సమానం..

విశాలాంధ్ర - వెల్దుర్తి: తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానమనిఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఆమె పాల్గొనితల్లులకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను తెలిపారు. సంపూర్ణ పోషణ అభియాన్ కింద తల్లులు, గర్భిణులు బలవర్ధక ఆహారం ఐసీడీఎస్ ద్వారాఅందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పద్మావతి, మహేశ్వరి, నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.